వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 343
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
నవంబర్ 01, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## ఎస్బీ ఎస్ఐ ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** చెన్నారావుపేట మండల పరిధిలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండీ. ఆసిఫ్ (57) బలవన్మరణానికి పాల్పడ్డారు. నర్సంపేట పట్టణంలోని వల్లభ్ నగర్ లో ఆయన నివాసం ఉంటున్నారు. అయితే గత కొంత కాలంగా ఆసిఫ్ కుటుంబ కలహాలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం విధులకు సైతం హాజరైన ఆయన రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. చికిత్స నిమిత్తం గత రాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు.





2లో..

# హద్దులు లేని చెరువులు

- దర్గాగా ఆక్రమణ.. ఖుషీగా నిర్మాణం
- ప్రైవేటే కాదు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- వరద నీటితో నిండా మునుగుతున్న ప్రజలు

డోర్నకల్ పట్టణంలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. చెరువుశిఖం భూముల్లో ఆక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనేక ఏళ్లుగా పరిరక్షించాల్సిన అధికారులు వివిధ కారణాలతో సైలెంట్ గా ఉండటంతో ఖబ్జా పర్వం మూడు విల్లాలు.. ఆరు భవంతులుగా సాగుతోంది. ఆక్రమణదారలు చట్టాలను స్టడీ చేసి మరి చెరువు భూములను చెరబడుతున్నారు. సంబంధిత అధికారులను అటువైపు రాకుండా మేనేజ్ చేసి ఇదివరకే ఉన్న రిజిస్టర్ ల్యాండ్ లకు బై నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. చెరువులను చెరబట్టి అందులో గృహాలు, ప్రార్థనా మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్, ధోబి గాట్లు, హాస్టల్స్ లే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలైన ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాన్ని కూడ నిర్మించినట్లు ప్రచారం సాగుతోంది. కంచే చేను మేసిందనే చందంగా ఆక్రమణకు గురైన ల్యాండ్స్ చరిత్ర చూస్తే రెవెన్యూ శాఖలో అప్పటి ఉద్యోగులే వీటికి ఆజ్యం పోశారని తెలుస్తోంది.

- వరంగల్ వాయిస్, డోర్నకల్

## సేంద్రియ పంటలు పండిద్దాం..

### ఆరోగ్య జీవనానికి బాటలు వేద్దాం, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### కలెక్టర్ తో కలిసి ఆర్గానిక్ రైతుల సంత ప్రారంభం



2లో..



బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో పర్యటన

8లో..

## బురద తొలగింపు పనులు చేపట్టండి



# హద్దులు లేని చెరువులు

- దర్జాగా ఆక్రమణ.. ఖుషీగా నిర్మాణం
- ప్రైవేటే కాదు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- వరద నీటితో నిండా మునుగుతున్న ప్రజలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణంలో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి వివిధ ప్రాంతాల్లో నీరు చేరి జన జీవణం స్తంభించింది. ఇక్కడి సమీపంలోని కుమ్మరి కుంట నుంచి వరద నీరు రైల్వే ట్రాక్ పైకి వచ్చి చేరటంతో రైళ్లు నిలిచిపోయాయి. దీంతో రైల్వే శాఖకు భారీ నష్టం వాటిల్లింది. రైల్వే డీఆర్వో గోపాలకృష్ణన్ తోపాటు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ రాంనాథ్ లు స్వయంగా విచ్చేసి పరిస్తితులను అంచన వేశారు. కొర్లకుంట కట్ట తొలిగించటం వల్లే వరద నీరు పట్టాలపైకి వచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఎదుట కూడ ప్రజలు ఈ విశయాన్ని వెల్లడించారు.

## కాదేదీ అనర్హం..

భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ప్రస్తుత తరుణంలో అక్రమణదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు అక్రమ దందా సాగుతోంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులు ఇచ్చే నజరానాలకు ఆశపడి కోట్ల విలువ చేసే భూములను వారికి దారాదత్తం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను ప్లాట్లుగా చేసి విక్రయిస్తూ కోట్లు గడిస్తుంటే వారిచ్చే మామూళ్లతో అధికారులు అక్రమ సంపాదనను పోగు చేస్తున్నారు.

## సార్లు.. ఇలా చేయలేరా..!

1956 కాసర ప్రకారం అప్పుడు నమోదైన చెరువుల విస్తీర్ణం ఎంత.. ప్రస్తుతం ఎంత ఉంది.. ఆక్రమణను గురైన ల్యాండ్ ఎంత అనే విషయాన్ని తెలిగ్గా గుర్తించవచ్చు. అప్పటి కాసర రికార్డులు, మ్యాపుల ఆధారంగా సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తద్వరా ఆక్రమణకు గురైన భూములను తిరిగి తీసుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇరిగేషన్ తో పాటు రెవెన్యూ అధికారులు ఈ చర్యలు వెంటనే చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వ భూముల రక్షణకు ఇది అతి సాధారణం. ఈ విషయాలు సాధారణ ప్రజలకు తెలిసినప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులైన ఎమ్మార్వో, ఆర్డీఓ, కలెక్టర్లు ఏమీ తెలియనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాష్ట్రాలు, రెవెన్యూ చట్టాలు ఏర్పాడి దాదాపు 70 సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికి బంధం, ఊర చెరువుకు హద్దులను ఏర్పాటు చేయకపోవటం లక్షల రూపాయల ప్రశ్నగా మారింది.



# సేంద్రియ పంటలు పండిద్దాం..

- ఆరోగ్య జీవనానికి బాటలు వేద్దాం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి ఆర్గానిక్ రైతుల సంత ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన పంటలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవితాన్ని గడపవచ్చని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పబ్లిక్ గార్డెన్స్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళ వేదికలో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ ఆర్గానిక్ రైతుల సంతను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి శనివారం ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల వినియోగం మన ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. గ్రామీణ రైతులు ఉత్పత్తి చేసే ఆర్గానిక్ ఆహార పదార్థాలు, నేటి మారుతున్న మోడరన్ ఫుడ్ కంటే ఎంతో మెరుగైనవన్నారు. ఈ సంత ద్వారా స్థానిక రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలు లభిస్తాయన్నారు. వినియోగదారులు కూడా నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తులను నేరుగా రైతుల నుంచే పొందాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ పద్ధతుల ద్వారా పండించే రైతులకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. సంత ముఖ్య నిర్వాహకులు భయ్య సారయ్య మాట్లాడుతూ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులు పండించిన ఉత్పత్తులను నగర ప్రజలకు పరిచయం చేయటం తమ ముఖ్య ఉద్దేశమన్నారు. సామాజికవేత్త, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ పబ్లిక్ గార్డెన్ లో ప్రతి నెల రెండు రోజులు ఈ సంత నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ ని కోరగా ఆమె సానుకూలత వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనసూయ స్టాల్స్ యజమాల నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అగ్రి, హార్టికల్చర్ సొసైటీ అడ్వైజర్ నల్లమాల వెంకటేశ్వరరావు, ఖమ్మం పట్టణ సంత ముఖ్య నిర్వాహకురాలు మాధవి, మహిళా రైతు చిన్నాల అనిత, చిలక మారి సంజీవరావు, రికార్డ్ మిల్లెట్ హబ్ నిర్వాహకులు కుసుమ సురేష్, కవిత దంపతులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఈ సంత నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు సారయ్య తెలిపారు. తరువాత ఎమ్మెల్యే, కలెక్టర్ సంతలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. రైతులు, చేనేత కార్మికులు, గిరిజన కళాకారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి ఉత్పత్తుల ప్రత్యేకతలు, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారు ప్రదర్శించిన సేంద్రియ పంటలు, చేనేత వస్త్రాలు, గిరిజన హస్తకళా ఉత్పత్తులను పరిశీలించి వారిని అభినందించారు.

# 2న పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

- హంటర్ రోడ్డులోని బీసీ హాస్టల్ లో ఏర్పాట్లు
- ఎన్నికల అధికారిగా పిట్ట ఉమాదేవి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా (జయశంకర్ భూపాలపల్లి జిల్లా మినహా) కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 2వ తేదీ ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్ లోని బీసీ నేత హాస్టల్ లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పిట్ట ఉమాదేవి తెలిపారు. గత కార్యవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నందున కొత్త కార్యవర్గం ఎన్నికకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పదవులతో పాటు మొత్తం 23 పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం కలిగిన సభ్యులందరూ పాల్గొనాలని ఎన్నికల అధికారి కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆమె వెల్లడించారు. అధ్యక్షులు, సహాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, సంస్థాగత కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, కార్యాలయ కార్యదర్శికి ఒక్కొక్కరిని ఎంపిక చేయనున్నారు. సంస్థాగత కార్యదర్శికి మాత్రం విశ్రాంత ఉద్యోగి మాత్రమే అర్హులుగా ప్రకటించారు. అదే విధంగా నలుగురు ఉపాధ్యక్ష పదవుల్లో ఒకటి మహిళకు, మరొకటి విశ్రాంత ఉద్యోగికి కేటాయించారు. ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, ముగ్గురు కార్యనిర్వాహక కార్యదర్శులతోపాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులకోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. కార్యవర్గ సభ్యుల్లో ఒక మహిళకు ప్రాధాన్యం కల్పించారు. ఉద్యోగులు నిర్ణీత సమయంలో హాజరై ఎన్నికలను విజయవంతం చేయాలని పిట్ట ఉమాదేవి కోరారు.

# వీరుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి




**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** తాడిత, పీడిత ప్రజల రాజ్యం కోసం విప్లవ ఉద్యమంలో పనిచేస్తూ బూటకపు ఎన్ కౌంటర్లకు, రాజ్య హింసకు, భూస్వామ్య ,పెట్టుబడుదారి వర్గాల శత్రుదాడులకు ప్రాణాలర్పించిన విప్లవోద్యమ వీరుల ప్రాణ త్యాగాలు వెలకట్ట లేనివని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రన్న అన్నారు. శనివారం ఖిలా వరంగల్ మండలం శివనగర్ లో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 1నుంచి 7 వరకు విప్లవోద్యమ వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని 'అమరవీరుల సంస్మరణ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల పార్లమెంటరీ పాలనలో స్వదేశీ పాలకులు దేశంలో కులం, మతం, పేదరికం, నిరుద్యోగాన్ని రూపుమాపి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారి వర్గాలకు మోకరిల్లి దేశ సంపదను అప్పనంగా కట్టబెడుతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాద ఫాసిజాన్ని పెంచి పోషిస్తూ, ప్రజల్లో కుల, మత విద్వేషాలను రగిలించి, ప్రజల ఐక్యతను, దేశ లౌకిక వ్యవస్థ మనుగడను, ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నదని ఆరోపించారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలను రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఇండ్లు కూలిపోయిన పేదలకు పక్కా ఇండ్లు నిర్మించాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా విప్లవోద్యమ వీరుల స్ఫూర్తితో దోపిడీ, పీడన, కుల, మత, ఆర్థిక అసమానతలు లేని నూతన ప్రజాతంత్ర విప్లవం కోసం జరిగే వర్గ పోరాటాల్లో క్రియాశీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు చిర్ర సూరి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, మాస్ లైన్ డివిజన్ నాయకులు మైదం పాణి, ఉసిల్ల రాజన్న, ల్యాదల్ల వెంకటస్వామి, కట్కూరి ప్రభాకర్, ఏలియా, చిన్న స్వామి, పి.లక్ష్మి, బొట్టు వెంకన్న, చంటి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, నవంబర్ 01, 2025

# కేయూసీ పోలీసులకు చిక్కిన దొంగ

■ రూ.6 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



**వరంగల్ వాయిస్, కేయూ :** రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను కేయూసీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పెగడపల్లి డబ్బాల వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను కాకతీయ యూనివర్సిటీ (కేయూసీ) పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ విలేకరులకు వెల్లడించారు. నేరస్తుడు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి, తేజిగూడకు చెందిన సెండే అరుణ్ కుమార్ (25), తండ్రి రామయ్యగా పోలీసులు గుర్తించారు. 2022లో వరంగల్‌లోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో (బీఎస్సీ, బీజడ్సీ) పూర్తి చేసిన అరుణ్ కుమార్, 2024లో ఉద్యోగాల కోసం హనుమకొండకు వచ్చి హాస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఈ క్రమంలోనే బెట్టింగ్‌లకు బానిసై అప్పులపాలయ్యాడు. ఆ అప్పులు తీర్చడానికి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. నిందితుడు ప్రధానంగా గోపాల్‌పూర్, భీమారం ఏరియాలలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడు సుమారు 10 నేరాలు చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడని సీఐ రవికుమార్ తెలిపారు.అతడి వద్ద నుంచి బంగారు ఆభరణాలు 40 గ్రాములు, వెండి ఆభరణాలు 50 గ్రాములు, నగదు రూ. 56,400, మొత్తం విలువ సుమారు రూ. 6,00,000 సొత్తును రికవరీ చేసినట్లు పోలీసుల తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పక్క ఇళ్ల వారికి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే, తమ ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వరుస దొంగతనాలతో పోలీసులకు సవాలు విసిరిన ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని, వేగంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని సీఐ రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన కేయూ ఎస్సైలు పి.శ్రీకాంత్, కె.నవీన్ కుమార్, క్లూస్ సిబ్బంది అయిన అహ్మద్ పాషా, రాజశేఖర్, జితేందర్ లను, వారికి సహకరించిన సీసీఎస్ వరంగల్ సిబ్బంది టి.మధు, బి.చందులను ఆయన ప్రశంసించారు.

# జూబ్లీహిల్స్‌లో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

■ నవీన్ యాదవ్ గెలుపుపై గాజర్ల అశోక్ ధీమా



**వరంగల్ వాయిస్, జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ (@ఐతు) రంగంలోకి దిగారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకై ఆయన తన అనుచరులతో కలిసి పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గాజర్ల అశోక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలులో ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ విస్తరణ, అభివృద్ధి పనుల గురించి కూడా ఆయన ప్రజలకు వివరించారు. జూబ్లీహిల్స్‌లోని ఓటర్లు ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు అని పేర్కొన్న అశోక్, వారంతా "చేతి గుర్తుకు" ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. నవీన్ యాదవ్ గెలిస్తే, ఈ ప్రాంతాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా, మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సీసీ కెమెరాలు, వైఫై జోన్‌లను అందుబాటులోకి తీసుకొస్తారని హామీనిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఇష్టారీతిన వ్యవహరించి రాష్ట్రాన్ని రూ.8లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలోకి నెట్టారని గాజర్ల అశోక్ విమర్శించారు. వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారినా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను మాత్రం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని, ప్రజలు పార్టీకి అవకాశం కల్పిస్తారని అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పద్మశాలి నేతల ఆత్మీయ సమావేశం

◆ పద్మశాలి ప్రతిభావంతులకు ప్రోత్సాహకం
◆ ఆర్థిక పారితోషికాలతో సన్మానం
◆ పద్మశాలి సంఘం, పోపా ఆధ్వర్యంలో తీర్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా శాఖ, హనుమకొండ జిల్లా పద్మశాలి ఆఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) సంయుక్తంగా హంటర్ రోడ్డులోని నంది హిల్స్‌లో గల జిల్లా కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించాయి. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా పోపా అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది వలస సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఒక ముఖ్య తీర్మానాన్ని ఆమోదించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థినీ విద్యార్థులకు తగిన ఆర్థిక పారితోషికాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా కళాశాలలు, నవోదయ కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీలలలో చదివే ఐనవోలు, ఆత్మకూరు, దామెర, శాయంపేట, పరకాల, నడికూడ, కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, హనుమకొండ, కాజీపేటలకు చెందిన పద్మశాలీ విద్యార్థులు వీటికి అర్హులని తెలిపారు. పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ (బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ) లలో మొదటి, ద్వితీయ, తృతీయ మెరిట్ సాధించిన అభ్యర్థులకు ఈ సన్మానం ఉంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి.. గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో లేదా కన్వీనర్ కోటాలో ప్రైవేటు కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందినవారు, ఎన్ఐటీ (NIT) లేదా ఐఐటీ (IIT) లలో మరేదైనా కాలేజీలలో ఉచితమైన (మెరిట్) సీటు పొందిన పద్మశాలి విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక గౌరవం దక్కుతుందని తెలిపారు. ప్రతిభావంతులైన పద్మశాలి విద్యార్థులు లేదా వారి గురించి తెలిసిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుల ధృవీకరణ పత్రం, మార్క్స్ మెమో, కాలేజీలో అడ్మిట్ అయిన ధృవపత్రం జిరాక్స్ పత్రాలతో దరఖాస్తును నవంబర్ 10 లోపు 73960 24613 సెల్ నంబర్‌కు పంపాలని పేర్కొన్నారు. ప్రతిభా పురస్కార కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ఫోన్ ద్వారా తెలియజేయబడుతుందని సంఘం నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో దుస్స శివశంకర్ (రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్), పోపా గౌరవ అధ్యక్షులు ప్రొఫెసర్ రామస్వామి, డాక్టర్ కూరపాటి రమేష్, పాషకంటి రాజేంద్రప్రసాద్ (జిల్లా ప్రధాన కార్యదర్శి), వలపదాసు శ్యాంసుందర్ (జిల్లా కార్యదర్శి), గుడిమల్ల కృష్ణారావు (రాష్ట్ర కార్యదర్శి), బింగి సతీష్ (జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శి), దుంపేటి నటరాజు (డివిజన్ అధ్యక్షులు), అసోసియేట్ ప్రొఫెసర్లు రవీందర్, వీరస్వామి, ఆడపు వెంకటరమణ, ఇంజమూరు సత్యనారాయణ, అంకం శ్రీనివాస్, కందగట్ల సత్యనారాయణ, బేతి సాంబయ్య, గుర్రపు ప్రసాదు, విజయేందర్, వివిధ మండలాల కార్యవర్గ సభ్యులు, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# విత్తనోత్పత్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

## మండల వ్యవసాయాధికారి రాకేష్



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో అధికంగా సాగవుతున్న వరి, మొక్కజొన్న విత్తనోత్పత్తి పంటల విషయంలో రైతు సోదరులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) రాకేష్ ఒక ప్రకటనలో కోరారు.రాబోయే యాసంగి పంట కాలానికి సంబంధించి, విత్తనోత్పత్తిని కొనసాగించదలిచిన రైతులు తప్పనిసరిగా కంపెనీల నుంచి అధికారికంగా 'ఆర్గనైజర్ల'గా అగ్రిమెంట్లు పొందిన వ్యక్తుల వద్ద మాత్రమే విత్తనాలను తీసుకోవాలని ఏవో స్పష్టం చేశారు. అంతేకాకుండా, రైతులు కూడా సదరు ఆర్గనైజర్లతో వ్యవసాయ అగ్రిమెంట్ చేసుకున్న తరువాతే ఈ విత్తనోత్పత్తి పంటను సాగు చేయాలని సూచించారు. కంపెనీల నుంచి అధికారిక ఆర్గనైజర్ అగ్రిమెంట్ లేకుండా ఎవరైనా వ్యక్తులు రైతులకు విత్తనాలను సరఫరా చేసినట్లయితే, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రాకేష్ హెచ్చరించారు. కాబట్టి, రైతులు ఈ ముఖ్య విషయాన్ని గమనించి, అనధికారిక వ్యక్తులను, సంస్థలను నమ్మి మోసపోకుండా తమ విత్తనోత్పత్తి కార్యక్రమాలను జాగ్రత్తగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

# అవినీతి నిరోధంపై అవగాహన ర్యాలీ




**వరంగల్ వాయిస్, దామెర :** అవినీతిని నిరోధించి దేశ ప్రగతిని కాపాడాలనే లక్ష్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), వరంగల్‌లోని ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) క్లబ్ ఆధ్వర్యంలో శనివారం "విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్"లో భాగంగా దామెర మండలంలోని దత్తత గ్రామమైన పులుకుర్తిలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు చురుగ్గా పాల్గొన్నారు. స్కూల్ పిల్లలకు,యు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవినీతిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ర్యాలీని కూడా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ అవినీతిని పూర్తిగా నిర్మూలించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ విషయంలో తమ వంతు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ రాజు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మరియు ఏఈఓ రామకృష్ణ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.

# పారదర్శకంగా పంట నష్టం అంచనా వేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల లక్షలాది ఎకరాల్లో పత్తి సహా ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో, ప్రభుత్వం తక్షణమే పారదర్శకంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుఫాన్ వల్ల ముఖ్యంగా పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా ఎకరాకు 8 నుండి 9 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన చోట, ఈసారి 5 క్వింటాళ్లకంటే తక్కువగా దిగుబడి వస్తుందని తెలిపారు. వర్షాల కారణంగా పత్తి నాణ్యత పడిపోవడంతో, రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP) కంటే చాలా తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల దుస్థితిని దృష్టిలో ఉంచుకొని పత్తి సహా అన్ని పంటలకు జరిగిన నష్టాన్ని విపత్తు నిర్వహణ నిధుల పరిధిలో చేర్చాలని ఆయన కోరారు. పంట నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేయాలని, రైతు వారీగా, పంట వారీగా వివరాలు సేకరించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి, నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా బలంగా నిలబెట్టే చర్యలు చేపట్టాలని కిషన్ రావు విజ్ఞప్తి చేశారు.

# సహాయక చర్యలు వేగవంతం చేయండి

◆ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే నాగరాజు పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు గోపాలపురం చెరువు కోతకు గురైన నేపథ్యంలో, నీట మునిగిన కాలనీల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. 56వ డివిజన్‌లోని టీఎన్జీవోస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జవహర్ నగర్ కాలనీలలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. చెరువు కోత కారణంగా ఇళ్లలోకి చేరిన నీటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే నాగరాజు, మున్సిపల్ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిని వీలైనంత త్వరగా తొలగించి, ప్రజలు తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు అనువైన పరిస్థితులను కల్పించాలని సూచించారు.ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలన్నీ



సమన్వయంతో పనిచేయాలని, అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పర్యటన సందర్భంగా జవహర్ నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ రజియా ఇల్లు నీట మునిగి ఆహార వస్తువులు నష్టపోయాయని ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన నాగరాజు, తన వంతుగా ఆమెకు ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. అదేవిధంగా, జవహర్ కాలనీలో నివసిస్తున్న మైలాయి విజయ, సమ్మక్క, ఇందిరమ్మలకు కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి ఇళ్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేయించి, వారికి సంబంధించిన స్థలాల్లో కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, వరద ప్రభావంతో నీట మునిగిన ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహించి రూ.15,000 ఆర్థిక సాయం, రేషన్ బియ్యం అందజేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలకై విద్యార్థుల భిక్షాటన

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం నయీంనగర్‌లో భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సుమారు రూ. 8,300 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం పేద విద్యార్థులకు, కళాశాలలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల కారణంగా కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సంతోష్ మాట్లాడుతూ "మా ఫీజులు మాకు చెల్లించండి" అని విద్యార్థులు రోడ్లు ఎక్కుతుంటే, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా సంస్థలపై విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే ఏఐఎస్ఎఫ్ చూస్తూ ఊరుకోదని భాషబోయిన




సంతోష్ హెచ్చరించారు. తక్షణమే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రంలోని ఎమ్మెల్యేల, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒట్కూరి ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జక్కుల భానుప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బుజ్జి జ్యోతి, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, చరణ్ గౌడ్, రాజు, రమేష్, రమ్య, సృజన, సౌమ్య లతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు భరోసా ఇవ్వండి

■ నష్టాల పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలి

■ అధికారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశం

**వరంగల్ వాయిస్, జనగామ:** అకాల వర్షాల కారణంగా జనగామ జిల్లాలో జరిగిన నష్టాలపై వివిధ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించడం అధికారుల బాధ్యత అని ఆయన అన్నారు. శనివారం జనగామ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ వర్షాల వల్ల కలిగిన నష్టాలను అధికారులు పక్కాగా అంచనా వేయాలన్నారు. పూర్తిగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, అధికారులు ఆ దిశగా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేయాలి.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం కావాలి. కొన్న ధాన్యం మిల్లులకు సకాలంలో రవాణా అయ్యేలా, మిల్లు యాజమాన్యాలు బస్తాలను త్వరగా దింపుకునేలా అధికారులు పర్యవేక్షించాలి. ప్రస్తుత నష్టాల అంచనాతో పాటు, రాబోయే యాసంగి సాగుకు రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కొట్టుకుపోయిన కల్వర్టుల మరమ్మత్తులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీహరి అధికారులను ఆదేశించారు.చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యంలో, యుద్ధ ప్రాతిపదికన దెబ్బతిన్న పీఆర్, ఆర్ అండ్ బి రోడ్లను, కొట్టుకుపోయిన కల్వర్టులను వెంటనే మరమ్మత్తులు చేసి రవాణా పరంగా రోడ్ కనెక్టివిటీని పునరుద్ధరించాలి. జిల్లా కలెక్టర్ రిజ్వాన్



బాషా షేక్ మాట్లాడుతూ వర్ష ప్రభావం వల్ల జిల్లాలో వాటిల్లిన నష్టాన్ని వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనలు జరిపి త్వరగా నివేదికలను రూపొందించాలని ఆదేశించారు. పీఆర్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి సందర్శన వివరాలను నష్టానికి సంబంధించిన ఫోటోలతో సహా సమర్పించాలి. మున్సిపాలిటీకి సంబంధించి ప్రతి వార్డును సందర్శించి నష్టాన్ని అంచనా వేయాలి.పడిపోయిన కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్‌లను త్వరగా గుర్తించి మరమ్మత్తులు చేయాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. అత్యంత ప్రాధాన్యంగా చేయాల్సిన మరమ్మత్తుల వివరాలను ఈరోజే అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన, పీఆర్, ఇరిగేషన్ తదితర శాఖలు ఇప్పటివరకు చేసిన నష్టాల అంచనా వివరాలను ఎమ్మెల్యే, కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, ఆర్డీఓలు గోపిరామ్, వెంకన్న, డీఆర్డీఓ పీడీ, వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, మార్కెటింగ్, సివిల్ సప్లై తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిట్ వరంగల్‌లో 'యూనిటీ రన్'



**వరంగల్ వాయిస్, నిట్ వరంగల్:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), వరంగల్‌లో జాతీయ ఏకతా దినోత్సవం సందర్భంగా ఉత్సాహభరితమైన 'యూనిటీ రన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిట్‌లో గల ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిట్ అడ్మినిస్ట్రేషన్ భవనం ముందు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు మరియు అధ్యాపకులు ఐక్యత, సౌభ్రాతృత్వం, జాతీయ సమైక్యత పట్ల తమ అంకితభావాన్ని వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం డైరెక్టర్, నిట్ వరంగల్ ఆధ్వర్యంలో జరిగిన "యూనిటీ ప్రతిజ్ఞ"తో ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీన్ (విద్యార్థి సంక్షేమం), డీన్ (అకడమిక్), ఎస్ఏసీ (SAC) అధ్యక్షుడు, ఈబీఎస్‌బీ క్లబ్ ఫ్యాకల్టీ అడ్వైజర్ మరియు ఇతర గౌరవనీయ అధ్యాపకులు హాజరై, జాతీయ స్ఫూర్తిని చాటారు. ప్రతిజ్ఞ అనంతరం, పాల్గొన్న వారందరూ ఉత్సాహంగా 'యూనిటీ రన్'ను ప్రారంభించారు. ఈ పరుగు అడ్మినిస్ట్రేషన్ భవనం నుండి మొదలై లెక్చర్ హాల్ కాంప్లెక్స్, సెంట్రల్ లైబ్రరీ మీదుగా తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకుంది. మొత్తం 120 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొని, ఐక్యత, జట్టు భావం మరియు సమగ్రత నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ 'యూనిటీ రన్' ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులు, అధ్యాపకుల మధ్య ఐక్యతా బంధాన్ని బలోపేతం చేయడం, శారీరక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం మరియు జాతీయ గర్వభావాన్ని పెంపొందించడం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉత్సాహం, సహకారం, పరస్పర అనుబంధంతో నిండిపోయి, పాల్గొన్న వారందరిలో ఒక గొప్ప భావాన్ని నింపింది. ఈబీఎస్‌బీ క్లబ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపింది.

# దళితులపై చిన్నచూపు సరికాదు



**వరంగల్ వాయిస్, దామెర :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దామెర మండలంలోని పులుకుర్తి గ్రామం నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దామెర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాదిగ మాట్లాడుతూ "చీఫ్ జస్టిస్ స్థాయిలో ఉన్న న్యాయమూర్తిపై దాడి జరిగినా, దానిపై కఠినమైన కేసు నమోదు చేయడంలో జాప్యం జరుగుతున్నది. దీని వల్ల దళితులకు ఆత్మగౌరవం లేకుండా పోతోంది. కేంద్రంలో చీఫ్ జస్టిస్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి దాడిపై కూడా ఏ ఒక్కరూ స్పందించడం లేదు. సామాన్య దళితుని పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. ప్రజా ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా ఉన్న నాయకులు కూడా స్పందించకపోవడం దళితుల పట్ల చిన్నచూపు చూస్తున్నట్లు కనిపిస్తోంది. దళితుల పట్ల మాట్లాడే పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, నాయకులు ఈ దాడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దామెర మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పరిమళ శ్రీధర్ మాదిగ, జిల్లా నాయకులు జిల్లెల్ల మురళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగేందర్ మాదిగ, మైపాల్ మాదిగ, చంటి మాదిగ, బుర్ర రాజు మాదిగ, గోవింద సుగుణాకర్ మాదిగ, సిద్దు మాదిగ, ప్రేమ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. బీసీ ముదిరాజ్ జిల్లా నాయకులు సిహెచ్ రవి, చీమల ప్రమోద్, చందు మాదిగ, గోవిందు వినయ్ మాదిగ, జైపాల్, ఐలయ్య మాదిగ, గడ్డం సాంబయ్య, మొగిలితో పాటు ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు.

# చేనేత కార్మిక పరపతి సంఘం కృషి అభినందనీయం

■ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కొత్తవాడ:** తెలంగాణ చేనేత కార్మిక పరపతి సంఘం (కొత్తవాడ, వరంగల్) పాలకమండలి సభ్యుల సంక్షేమం కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కొనియాడారు.కొత్తవాడలోని పరపతి సంఘం 13వ వార్షిక సమావేశం కూచన సారయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు మాట్లాడుతూ... సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం, పెళ్లిళ్లు, మరణాల సందర్భంగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా సభ్యుల సంక్షేమానికి సంఘం కృషి చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు రెండు సంవత్సరాలు కావస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల రుణమాఫీ ఇప్పటికీ ఏ ఒక్కరికీ కాలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం తమ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలు డిమాండ్లు చేశారు. నేతన్న బీమా పథకాన్ని సక్రమంగా అమలు పరచి, మరణించిన కార్మికుని కుటుంబానికి 10 రోజులలోపు బీమా మొత్తాన్ని అందించాలి. చేనేత సహకార సంఘాలకు గత 12 ఏళ్లుగా ఎన్నికలు లేవు. వెంటనే ఎన్నికలు నిర్వహించి, టెస్కోకు పాలక మండలిని నియమించాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేవలం ఇల్లు కాకుండా, చేనేత కార్మికుల కోసం వర్క్ షెడ్‌ను కూడా నిర్మించాలి.కూలీ రేట్లు, పింఛను: పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల కూలీ రేట్లు పెంచేందుకు చర్యలు చేపట్టాలి. చేనేత కార్మికుల పింఛను రూ. 5 వేలకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు నూలుపై మరియు చేనేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని తక్షణమే తొలగించాలని వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు లింగబత్తిని యాదగిరి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణతో పాటు కందగట్ల రమేష్, గుండ రమేష్, కూచన భద్రయ్య, ఆడెపు రవి, ఎలుగం వెంకటేశ్వర్లు, వేముల రవీందర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# "కేసులు వద్దు.. రాజీ ముద్దు"

■ నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్




**వరంగల్ వాయిస్, వరంగల్/హనుమకొండ:** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, డాక్టర్ కె.పట్టాభిరామారావు పాల్గొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఈ నెలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు ప్రకటించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, నవంబర్ 15 శనివారం రోజున ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడుతుందని ప్రధాన న్యాయమూర్తులు తెలిపారు. ఈ లోక్ అదాలత్ వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులతో పాటు నర్సంపేట, పరకాల కోర్టులలో కూడా జరగనుంది. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటార్ ప్రమాద క్లెయిములు, చిన్న చిన్న వివాదాల పరిష్కారాలు ఈ లోక్ అదాలత్ లో చూపబడతాయన్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా, రాజీ మార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నామని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. కేసుల పరిష్కారం త్వరితంగా ఉంటుంది, ఇరుపక్షాల అంగీకారంతో రాజీ కుదురుతుంది. న్యాయ ప్రక్రియలో అధిక భారం ఉండదు. ఈ లోక్ అదాలత్‌లో పోలీస్ శాఖ ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులు సమన్వయంతో సహకరించి, కేసుల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం సమాజానికి, న్యాయవ్యవస్థకు మంచిదని, మీడియా మిత్రులు కూడా దీనిని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో మరొక ముఖ్య ప్రకటన చేశారు. మొంతా తుఫాను వల్ల నష్టపోయిన వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలకు చేయూతగా హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ హెల్ప్ డెస్క్ న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో సోమవారం రోజున అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# వరంగల్‌ను వరద ముంపు నుంచి కాపాడాలి

◆ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజావేదిక విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, సుబేదారి:** తరచూ వరద ముంపునకు గురవుతున్న వరంగల్ మహా నగరాన్ని ఈ విపత్తు నుంచి శాశ్వతంగా కాపాడాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ విడుదల చేసిన సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడారు. 2021 సంవత్సరం తర్వాత ఇప్పటివరకు వరంగల్ మహానగరం నాలుగు పర్యాయాలు వరద ముంపుకు గురై ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిందని డాక్టర్ శేషు గుర్తు చేశారు. ఈ వరదల కారణంగా పేద ప్రజలు ఇళ్లు కోల్పోవడం, భారీగా ఆస్తి నష్టం జరగడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు."వరదలు వచ్చిన తరువాత చర్యలు చేపట్టే బదులు, వరద ముంపుకు గురి కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం పట్ల డాక్టర్ శేషు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2021 వరదల సందర్భంగా వరంగల్ నగరాన్ని సందర్శించిన నాటి పురపాలక శాఖ మంత్రి, ఆక్రమణల తొలగింపునకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి, మూడు నెలల్లో పరిష్కారం చూపెడతామని హామీ ఇచ్చారు. కానీ, ఆ హామీ నెరవేరలేదు, ఆక్రమణలు తొలగించలేదు. ఆరు నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వరంగల్‌లో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం ₹4,170 కోట్ల రూపాయలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు, కానీ ఇప్పటికీ నిర్మాణం కోసం ఎలాంటి ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. అధికారుల అశ్రద్ధ, నిర్లక్ష్యం, పట్టింపులేని ధోరణి వలనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైఫల్యంతో వరంగల్ నగరం తరచూ వరద ముంపుకు గురవుతోందని ఆయన డిమాండ్ చేశారు. మొన్నటి తుఫాన్ వలన ఇళ్లు కోల్పోయిన వారికి, ఆస్తి నష్టం జరిగిన వారికి ₹20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తుఫాన్ వలన దెబ్బతిన్న రహదారులను వెంటనే పునర్నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ధారబోయిన సతీష్, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, యశ్వంత్ యాదవ్, నరేందర్, డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ పూజ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని పద్మాక్షి రోడ్డులో వెలసిన శ్రీ హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసం శనివారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆంజనేయ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకం నిర్వహించారు.స్వామివారికి చందన సేవ నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.భక్తుల గోత్రనామాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం నిర్వహించబడింది. పూజా కార్యక్రమాల అనంతరం, కొక్కుల నిహారిక, సాయి చందు దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అన్నదాన కమిటీ సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. అధ్యక్షులు గందె కృష్ణ, కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కరు దశరథ్ కుమార్, గంప్ర టి.సుధాకర్, ఎన్. కొమురయ్య, లక్ష్మినారాయణ, ఎల్లయ్య తదితరులు, ఇతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'చలో హైదరాబాద్'



**వరంగల్ వాయిస్, దామెర:** భారతదేశ కేంద్ర సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ (సీజేఐ) జడ్జి జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ 'చలో హైదరాబాద్' నిరసన ర్యాలీకి దామెర మండలం నాయకులు బయలుదేరారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. దామెర గ్రామం నుంచి బయలుదేరిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. కేంద్ర జడ్జిపై జరిగిన దాడిని నిరసిస్తూ "కేంద్ర న్యాయమూర్తిపై దాడి జరిగితేనే స్పందన సరిగా లేకపోతే, సామాన్య ప్రజలు, దళితుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. ఈ దాడి విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ స్పందించకపోవడం దళితుల పట్ల చిన్నచూపును సూచిస్తుంది" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ 'చలో హైదరాబాద్' నిరసన కార్యక్రమంలో దామెర గ్రామం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ మాదిగ, గ్రామ ప్రధాన కార్యదర్శి కొడకండ్ల శీను మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు దామెర రాజు మాదిగ, దామెర సుమన్ మాదిగ, పొన్నాల రాంబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పేదవారికి కాంగ్రెస్ భరోసా



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:**నియోజకవర్గంలో పేద ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కుల పంపిణీ వేగంగా జరుగుతోంది. హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను స్వయంగా అందజేశారు. శనివారం రూ. 47,62,000 విలువ చేసే 135 చెక్కులను ప్రణవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదవారి పట్ల, ఆరోగ్య రీత్యా ఆసుపత్రిలో చేరిన వారికి మానవతా దృక్పథంతో అందించే సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంలో ఎలాంటి జాప్యం వహించకుండా, చెక్కులు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోన హుజూరాబాద్ పట్టణం 4,68,000, హుజూరాబాద్ మండలం రూ.10,17,000, జమ్మికుంట పట్టణం రూ. 3,90,000, జమ్మికుంట మండలం రూ.6,44,000, వీణవంక మండలం రూ.12,50,000,–కమలాపూర్ మండలం రూ. 9,92,000 విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు.

## దిగజారుడు రాజకీయాలు మానుకోండి

**కౌశిక్ రెడ్డిపై వొడితెల ప్రణవ్ ఆగ్రహం!**

**జూబ్లీహిల్స్‌లో బోగస్ ప్రచారాలు చేస్తున్నారంటూ విమర్శ**

**'రీల్స్ ఆపి రియల్‌లోకి రండి' అని హితవు**



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా హుజూరాబాద్ నియోజకవర్గ పరువు తీస్తున్నారని, దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రణవ్ మాట్లాడుతూ... "కౌశిక్ రెడ్డి హుజూరాబాద్‌కు సంబంధించిన వ్యక్తులతో 'చిట్ చాట్' కార్యక్రమం పెట్టి, ఆ వ్యక్తులు జూబ్లీహిల్స్‌లో ఉన్నట్టుగా బోగస్ ప్రచారాలు చేస్తున్నారు. ప్రచారం చేయాలి కానీ, రాజకీయాల్లో ఇంత దిగజారుడు రాజకీయం పనికిరాదు. ఇది హుజూరాబాద్ నియోజకవర్గం పరువు తీసే చర్య" అని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి 'రీల్స్' చేయడం ఆపి, 'రియల్'లోకి రావాలని ప్రణవ్ హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే పరమావధిగా ప్రచారం చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం బోగస్ మాటలతో ప్రచారం చేస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో యువత కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటిస్తున్నారని, ఇది ఆయన సోషల్ మీడియానే చెప్తోందని ప్రణవ్ అన్నారు. ఈ విషయాన్ని చూసైనా కౌశిక్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు."హుజూరాబాద్ వేదికగా 'చస్తా' అని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు జూబ్లీహిల్స్‌లో పని చేయవు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, నిస్వార్థ సేవలే జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను గెలిపిస్తాయని" ప్రణవ్ ధీమా వ్యక్తం చేశారు.

# తూర్పులోనూ భారీ నష్టం



- అయినా కన్నెత్తి చూడని రేవంత్ రెడ్డి
- నైతిక బాధ్యత వహించి మంత్రి రాజీనామా చేయాలి
- బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రదీప్ రావు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** తుఫాన్ ప్రభావంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు కాలనీలు నీట మునిగినప్పటికీ ఏమాత్రం పట్టించుకోని కొండా సురేఖకు రాష్ట్ర మంత్రిగా కొనసాగే హక్కు లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి నియోజకవర్గంలోనూ భారీ నష్టం వాటిల్లినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమన్నారు. తూర్పు మొత్తం అతలాకుతలంకాగా బాధితులు నీట మునిగి ఇబ్బందులు పడుతుంటే సీఎం పక్కన నిలబడి ఫొటోలకు ఫోజులిస్తున్నారని మండిపడ్డారు. తీవ్ర వరద ప్రభావానికి తూర్పులోని మైసయ్య నగర్, బీఆర్ నగర్, ఎన్ఎన్ నగర్, శివ నగర్, డీకే నగర్, పెరుక వాడ, సంతోషిమాత కాలనీ, శిరంగిరాజారాంతోట సహా పలు కాలనీలు నీట మునిగాయన్నారు. మంత్రిగా ఉండి వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ఏం తెచ్చారో తెలుపాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజలను నిండా ముంచిన నీకు ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పర్యటించిన సీఎం తూర్పు వైపు కన్నెత్తి కూడా చూడలేదంటే మంత్రి పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. తూర్పుపై అటు ముఖ్యమంత్రికి, ఇటు మంత్రి కొండా సురేఖకు పట్టింపులేదని విమర్శించారు. కష్టకాలంలోనైనా మీ దందాలు పక్కనబెట్టి ప్రజలకు అండగా నిలవాలంటూ హితవు పలికారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.10 వేల నష్టపరిహారం ఏ మూలకు సరిపోతుందన్నారు. ఒక్కో రైతు ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి పెడితే ముష్టి ఇచ్చినట్లు పది వేలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరానికి రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నగరంలో వరద ముంపునకు గురైన ప్రజలకు తక్షణమే రూ.25 వేల పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, తదితర మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పంట నష్టాన్ని అంచనా వేయండి



- కలెక్టర్ సత్య శారద
- నెక్కొండలో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, నెక్కొండ :** మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని నెక్కొండ మండలం రెడ్ల వాడ, వెంకటాపూర్ గ్రామాలతోపాటు పర్వతగిరి మండలంలోని ఏనుగల్లులో నేలకొరిగిన వరి పంట, బొప్పాయి పంటలను, రెబ్బతిన్న రహదారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ రైతులు అధైర్య పడొదన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వరదలతో జరిగిన పంట, ఆస్తి నష్టాల వివరాలను వెంటనే నమోదు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నెక్కొండ మండలం వెంకటపూర్ గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వర్షాల వల్ల వెంకటాపూర్ కాజ్ వేపై నీరు ప్రవహించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రెడ్లవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు గ్రామంలో చేసిన ఫీవర్ సర్వేపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా రోడ్ల భవనాల అధికారి రాజేందర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు చాలా కాలంగా పెండింగ్ లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యవర్గ సమావేశం అలంకార్ జంక్షన్ లోని టీఎన్జీవోస్ భవన్ లో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల సాధనే లక్ష్యంగా హనుమకొండలో పెద్ద ఎత్తున సభను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సభకు ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో టీఎన్జీవో యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మెంబర్ షిప్ పెంచాలని జిల్లా కార్యవర్గానికి, ఫోరంల కార్యవర్గాలకు, యూనిట్ల కార్యవర్గానికి దిశా నిర్దేశం చేశారు. అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ జిల్లాలో ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కారం చేసేందుకు అనునిత్యం కృషి చేస్తోందన్నారు. జిల్లా కోశాధికారి పనికెల రాజేష్ మాట్లాడుతూ జిల్లాలో యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని కార్యాలయాల్లో మెంబర్షిప్ విధిగా పెంచాలని ప్రతి ఒక్క ఉద్యోగి మెంబర్షిప్ తీసుకునేలా మనందరి అడుగులు ఉండాలని పేర్కొన్నారు. కార్యవర్గ సమావేశానంతరం జిల్లా ఉపాధ్యక్షురాలు, మహిళా వింగ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి పదవీ విరమణ చేసిన సందర్భంగా వారిని టీఎన్జీవోస్ యూనియన్ పక్షాన పెద్ద ఎత్తున సన్మానించారు. జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవాధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రాము నాయక్, జిల్లా నేతలు రాజమౌళి, చీకటి శ్రీనివాస్, సురేష్, రాజ్యలక్ష్మి, కల్పన, రాజేశ్వర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, రాజీవ్, పైడి రాజు, మల్లేశం, సుదర్శన్, శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, ప్రణయ్, పృథ్వి, రమేశ్, కళ్యాణి, శ్రీలత, రాజమణి, హరినాథ్, అశోక్, మహబూబ్, వెంకట్రాం రెడ్డి, వెంకన్న, కృష్ణ, శిరీష, రజిత, మాధవి, నాగరాణి, సుధాకర్, నవీన్, సిద్ధార్థ పాల్గొన్నారు.

# మార్చి 19 లాక్ చేసిన టాక్సిక్






'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియారా అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.



## పెద్ది కొరియోగ్రాఫర్‌గా జానీమాస్టర్

రేప్ కేసు నిందితుడిని తీసుకోవడంపై రచ్చ మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొని గతంలో జైలు జీవితం గడిపిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రీఎంట్రీపై టాలీవుడ్‌లో పెద్ద దుమారం రేగుతోంది. ఆయన ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'కి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా అతడిని చిత్రబృందం నియమించడంపై నెట్టింట తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని, పోక్సో చట్టం కింద అరెస్ట్ అయిన వ్యక్తికి మళ్లీ సినీ పరిశ్రమలో పెద్ద హీరో సినిమాలో పనిచేసే అవకాశం ఎలా ఇస్తారంటూ నెటిజన్లు, సినీ వర్గాలు తీవ్ర స్థాయిలో ప్రశ్నిస్తున్నాయి. సినిమా అనేది సమాజంపై బలంగా ప్రభావం చూపే మాధ్యమం. అటువంటి మాధ్యమంలో మహిళలపై నేరాలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులను తిరిగి తీసుకోవడం ద్వారా టాలీవుడ్ ఎలాంటి సందేశం ఇవ్వదలుచుకుందని పెద్ది చిత్ర బృందంని పలువురు నిలదీస్తున్నారు. రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలతో పాటు మైత్రీ మూవీ మేకర్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు నైతిక విలువలను మర్చిపోయి.. వివాదాస్పద వ్యక్తులకు పని కల్పించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు.



## వశిష్ట మల్లిడిని లైన్‌లో పెట్టిన రవితేజ

టాలీవుడ్ యాక్టర్ రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులు, ఫాలోవర్లను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. భాను బోగవరపు డైరెక్షన్‌లో నటిస్తోన్న మాస్ జాతర నేటినుంచి థియేటర్లలో సందడి చేయనుంది. రవితేజ మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్‌టీ 76 ప్రాజెక్ట్‌ను కూడా లైన్‌లో పెట్టగా.. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రవితేజ ఈ సారి చిరంజీవి డైరెక్టర్‌తో సినిమా చేసే ఎ□`లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఇంతకీ అతడెవరనే కదా మీ డౌటు. బింబిసారతో సూపర్ హిట్ అందుకుని ప్రస్తుతం చిరంజీవితో విశ్వంభర తెరకెక్కిస్తున్న వశిష్ఠ మల్లిడి. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ ఇటీవలే రవితేజకు ఓ ఐడియా చెప్పాడని వార్తలు వస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ క్రేజీ కాంబోలో సినిమా ఒకే అవుతుందా..? అనేది ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా వస్తుందని.. పాపులర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ ఇద్దరి కోసం ఓ కథ రెడీ చేశాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మరి వశిష్ఠ డైరెక్ట్ చేయబోయేది ఈ ప్రాజెక్ట్‌నేనా..? లేదంటే సెఫరేట్ సినిమా ఉండబోతుందా..? అనేది తెలియాల్సి ఉంది.

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, నవంబర్ 01, 2025

# బురద తొలగింపు పనులు చేపట్టండి

◆ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
◆ హనుమకొండ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో పర్యటన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేగవంతంగా బురద తొలగింపు పనులను చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ పరిధిలోని వాజ్ పేయి కాలనీ, టీవీ టవర్ కాలనీ, ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, సమ్మయ్య నగర్ వరద ప్రభావిత ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి పునరుద్ధరణ పనులు చేపట్టడానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లతోపాటు ఏర్పడిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. యంత్రాలతో పాటు పెద్ద సంఖ్యలో సిబ్బంది వినియోగించి చెత్తతో పాటు బురదను వేగవంతంగా తొలగించాలన్నారు. లేకుంటే వ్యాధుల సంక్రమణ జరుగుతుందని కమిషనర్ అధికారులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో సరఫరా అవుతున్న తాగునీటిని కమిషనర్ పరిశీలించారు. తాగునీరు కలిషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# స్పీడ్ పెంచండి

● వరద నష్టంపై త్వరగా సర్వే పూర్తి చేయాలి
● దెబ్బతిన్న రహదారుల్లో రాకపోకలను పునరుద్ధరించాలి
● హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై సర్వే త్వరగా పూర్తిచేసి ఆ నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం తీవ్ర వరద ప్రభావంతో హనుమకొండలోని సమ్మయ్య నగర్ పరిధిలోని కాలనీలో జరిగిన నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనా కోసం సర్వే నిర్వహిస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించి అధికారులు, బాధితులతో మాట్లాడారు. అదేవిధంగా అమరావతి నగర్ లో దెబ్బతిన్న రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రాథమిక అంచనా కోసం చేపట్టిన ఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్క ఇల్లు కూడా విడిచి పెట్టొద్దని పేర్కొన్నారు. నీట మునిగిన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించగా ఆరు అగ్నిమాపక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దెబ్బతిన్న రోడ్లను సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేయించి రాకపోకలు సాగే విధంగా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ముంపు నుంచి తప్పించేందుకు సమ్మయ్య నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీలలో శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు కోసం అంచనా వేసి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ముంపు కాలనీలలో పారిశుద్ధ్య నిర్వహణను వేగవంతం చేయాలన్నారు. అక్కడ ఉన్న బాధిత కుటుంబాలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద నష్టం వల్ల కలిగిన వివరాల నివేదికను ప్రభుత్వానికి అందించి పరిహారం అందించే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఎక్కడైనా దెబ్బతిన్న రోడ్లను త్వరగా మరమ్మతు పనులు చేయించి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఆర్ అండ్ బి డీఈలు ఉదయ్, గోపికృష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



**వరంగల్ వాయిస్, మట్టేవాడ :** కార్తీక ఏకాదశి సందర్భంగా బట్టల బజార్ లోని శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం శ్రీ వారి ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఇట్టి వ్రతాలలో సుమారు వంద జంటలు పాల్గొన్నాయని ఆలయ ఈఓ కిషన్ రావు, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న వారికి భోజన సౌకర్యాలు కల్పించారు.



# నీటి పాలైన రైతు కష్టం

● ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి
● కలెక్టర్లకు మాజీ మంత్రి ఎర్రబెల్లి వినతి

**వరంగల్ వాయిస్, వరంగల్/జనగామ :** రైతుల కష్టం నీటిపాలైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రేవంత్ రెడ్డికి రైతుల బాధ ఏం తెలుస్తుందని ఎద్దేవా చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ లతో కలిసి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం వరంగల్, హనుమకొండ కలెక్టర్లను కలిసి రైతుల పక్షాన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ప్రభుత్వం కేవలం ప్రకటనలకు, హామీలకు పరిమితం కాకుండా నష్ట పోయిన ప్రతి రైతుకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. రైతులు అధైర్య పడొద్దంటూ పేర్కొన్నారు. మీకు న్యాయం జరేగే వరకు మీ పక్షాన పోరడుతామంటూ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనతోనే ఇంత నష్టం జరిగిందన్నారు. సమయానికి నీళ్లు, యూరియా ఇచ్చి కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. రైతుల నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారం తక్షణమే చెల్లించాలన్నారు.



**జనగామలో..**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషను కలిసి వినతి పత్రం అందజేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణ పురంలో నేలమట్టమైన పంటలను పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. తీవ్రంగా పంట నష్టపోయిన రైతు పోగు అశోక్ ని పరామర్శించారు. చేతికొచ్చిన పంట కళ్లెదుటే నీటిపాలవ్వడంతో కన్నీరుమున్నీరవుతున్న రైతుల గోడును ఆయన అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న వరి, పత్తి ఇతర పంట పొలాలను పరిశీలించి, రైతుల పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు సర్వం కోల్పోయారన్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలు నీటిలో మునిగిపోవడం, గృహ నష్టం, ఆస్తి నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నగరంలోని ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, వరదల వల్ల ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నష్టం వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు పని తీరును సమీక్షించి, సక్రమంగా సమర్ధవంతంగా నష్టపరిహారం వివరాలు నమోదు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటనలో బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, అధైర్య పడొద్దని హామీ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారని, పూర్తిగా నష్టం జరిగిన గృహాలకు రూ.1.30 లక్షలు, పాక్షికంగా నష్టం జరిగిన గృహాలకు రూ. 6,500, వరద నీటితో జలమయమైన గృహాలకు రూ. 15 వేలు, నష్టం వాటిల్లిన గుడిసెలకు రూ. 8 వేలు, ప్రభుత్వం నుంచి సహాయంగా అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే, బాధిత కుటుంబాలకు అవసరమైన తక్షణ సహాయం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం జరుగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని, పునరావాసం పరిశుభ్రత కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com